సాక్షి నిర్మల్

శుక్రవారం । 24 । జనవరి । 2025

బాలి'కల'కు రెక్కలిద్దాం!

ఆడపిల్ల అమ్మ అనే పదానికి కొనసాగింపు. నాన్నను కొడుకుగా చూసుకునే మరో అమ్మ. కంటికి రూపం.. ఇంటికి దీపం.. మమతకు అపురూపం ఆడపిల్ల. ఇంటికి మహాలక్ష్మి.. చదువులో సరస్వతి.. ఆదరించడంలో అన్నపూర్ణాదేవి.. కానీ ఇప్పటికీ ఆడపిల్ల అంటే ఓ టెన్షన్ అన్న భావన చాలా మందిలో ఉంది. అయితే ఆడపిల్ల అంటే టెన్షన్ కాదు.. టెన్ సన్స్‌కు సమానం అంటున్నారు నేటితరం బాలికలు. నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కథనం.

- వివరాలు IIలో ▸



న్యూస్‌రీల్

ఒత్తిడి లేకుండా చదవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న పరశురాం

మామడ: విద్యార్థులు మానసికంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా చదివి మంచి మార్కులు సాధించాలని మాధ్యమిక జిల్లా విద్యాశాఖ అధికారి పరశురాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధత, ప్రాక్టికల్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి ప్రతిభను కనబర్చాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికిరణ్, అధ్యాపకులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవరకోట ఆలయ ప్రాంగణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో భారత్ క్రీడోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలు విద్యార్థులలో ఉత్సాహం నింపడమే కాకుండా, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని తెలిపారు. ఏబీవీపీ విద్యార్థులు దేశభక్తితోపాటు, సమాజంపై బాధ్యతగా మెలుగుతారన్నారు.

ఎస్పీ చొరవతో యువకుడి ఆచూకీ లభ్యం



యువకుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

భైంసాటౌన్: ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో భైంసా పట్టణంలో ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న ప్రజావాణి సత్ఫలితాలిస్తోంది. కుభీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ యువకుడు అదృశ్యం కాగా, అతని తల్లిదండ్రులు బుధవారం భైంసాలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీని కలిసి విన్నవించారు. స్పందించిన ఎస్పీ యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన బృందం సాంకేతిక పరిజ్ఞానంతో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో యువకుడి ఆచూకీ గుర్తించింది. ఈ మేరకు గురువారం యువకుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన 12 గంటల్లోనే యువకుడి ఆచూకీ లభ్యం కావడంతో యువకుడి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. యువకుడి ఆచూకీ కనిపెట్టిన కుభీర్ ఎస్సై రవీందర్‌తోపాటు టీం సభ్యులను ఎస్పీ అభినందించారు.

'పది' విద్యార్థులకు పునఃశ్చరణ పరీక్షలు నిర్వహించాలి



క్రికెట్‌లోని హ్యాట్రిక్ గురించి వివరిస్తున్న డీఈవో రామారావు

లోకేశ్వరం: పదో తరగతి విద్యార్థులకు పునఃశ్చరణ పరీక్షలు నిర్వహించాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని కన్కపూర్–అబ్దుల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే విషయాలు చక్కగా విని అవగాహన చేసుకోవాలన్నారు. ఉదయం సాయంత్రం వేళ నిర్వహించే ప్రత్యేక తరగతులకు తప్పకుండా హాజరు కావాలన్నారు. పునఃశ్చరణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. భోజనం వండే తీరును పరిశీలించి పలు సూచనాలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈవో చంద్రకాంత్, హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిధులున్నా.. మొదలు కాలే..

- భైంసా డిగ్రీ కళాశాల 'పీఎం ఉష'కు ఎంపిక
- రూ.5 కోట్లు మంజూరు
- పనులు ప్రారంభించని వైనం
- గదులు సరిపోక విద్యార్థుల ఇబ్బందులు



భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఎం ఉష(ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) పథకానికి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు కేటాయిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ గత మార్చిలో ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఇందులో నుంచి రూ.2 కోట్లు ఫర్నిచర్ కోసం కేటాయించగా, రూ.3 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఫర్నిచర్ కూడా పూర్తిస్థాయిలో రాలేదని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో ఇటీవల కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను కలిసి పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

695 మందికి ఆరే గదులు..

పట్టణ శివారులోని పార్డి(బి) బైపాస్ రోడ్‌లో జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1995లో ఏర్పాటైంది. తొలుత బీఏ, బీకాం కోర్సులు ఉండగా, ప్రస్తుతం బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంపీసీ కోర్సులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలలో తరగతులు కొనసాగుతున్నాయి. మూడు మీడియంలు కలిపి 695 మంది విద్యార్థులు కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. అయితే కళాశాలలో ఆరు తరగతి గదులే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పీఎం ఉష కింద మరో 16 తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. ఏటా వార్షిక పరీక్షల సమయంలో పరిమితికి మించి విద్యార్థులను కేటాయిస్తుండడంతో విద్యార్థులు వరండాలో, నేలపై కూర్చుని పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ సబ్జెక్టులకు సంబంధించి నాలుగు ల్యాబ్‌లు ఉండాల్సి ఉండగా, రెండే గదులు ఉన్నాయి. పీఎం ఉష కింద పనులు పూర్తయితే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. అలాగే ఫర్నిచర్, కంప్యూటర్ టేబుళ్లు, రీడింగ్ టేబుళ్లు, డ్యూయల్ డెస్కులు, ప్రొజెక్టర్లు, ఇతర వసతులు అందుబాటులోకి రానున్నాయి.

పనులు ప్రారంభించలేదు...

పీఎం ఉష పథకం కింద కళాశాలకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. రూ.2 కోట్లు ఫర్నిచర్ కోసం కాగా, రూ.3 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుత్తేదారుతో అగ్రిమెంట్ పూర్తికాలేదని చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యేను సైతం కలిసి పనులు ప్రారంభించేలా చూడాలని కోరాం.

– కరోల్ల బుచ్చయ్య, కళాశాల ప్రిన్సిపాల్, భైంసా

త్వరలోనే ప్రారంభిస్తాం...

భైంసా డిగ్రీ కళాశాలలో పీఎం ఉష పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తయింది. అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అది పూర్తకాగానే పనులు మొదలుపెడతాం. త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– అశోక్ కుమార్, ఈఈ(సోషల్ వెల్ఫేర్)

తుది దశకు వర్గీకరణ పోరాటం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



అంబేద్కర్ విగ్రహంవద్ద డప్పు కొడుతున్న మందకృష్ణ

నిర్మల్‌టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం తుది దశకు చేరిందని, ఈ సారి ఎలాగైనా సాధించి తీరుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు కార్యక్రమ ప్రచారంలో భాగంగా గురువారం నిర్మల్‌కు వచ్చారు. మినీ ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి డప్పు కొట్టారు. అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక టీఎన్జీవోస్ భవనానికి చేరుకుని సమావేశంలో మాట్లాడారు. మాదిగలు, మాదిగ ఉపకులాలు వాస్తవానికి వెనుకబడి ఉన్నాయన్నారు. అందుకే వారికి న్యాయం జరగాలని లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతి కోసమే ఏపార్టీకైనా మద్దతిచ్చామన్నారు. యుద్ధం చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. దీంతో వర్గీకరణకు మార్గం సుగమమైందని తెలిపారు. దీనిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్న రేవంత్‌రెడ్డిపై కొంత మంది పలుబడి, డబ్బులు, టీవీ, పేపర్, రాజకీయ ప్రాబల్యం చూపుతున్నారన్నారు. ఫిబ్రవరి 7న మాదిగల సత్తా చాటుదామన్నారు. ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, సీనియర్ నాయకులు కత్తి నరేందర్, నల్లూరి పోశెట్టి, గాజుల రవికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయంతో చదవాలి



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో గుర్తింపు పొందాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సోఫీనగర్ సమీపంలోని నిర్మల్ రూరల్, సోన్ కేజీబీవీ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. నాసిరకమైన సరుకులు సరఫరా చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

పది విద్యార్థులకు సూచనలు..

అనంతరం తరగతి గదిలో కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారికి అభ్యాసం, లక్ష్యాలు, సబ్జెక్టుల వారీగా పాఠాలు బోధించి సూచనలు చేశారు. గణితం ప్రశ్నలను అడిగి విద్యార్థులతో బోర్డుపై సమస్యలు సాధన చేయించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

బేటీ బచావో బేటీ పడావో పోస్టర్ ఆవిష్కరణ

బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆవిష్కరించారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల వేడుకలు ఈనెల 22వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహిస్తుందని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆడపిల్లల చదువును ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, మహిళ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వసంత పంచమికి విస్తృత ఏర్పాట్లు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: వసంత పంచమి వేడుకలకు బాసర ఆలయంలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల రద్దీని అంచనా వేసి క్యూలైన్లను, అదనపు అక్షరాభ్యాస మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు పాలు, పండ్లు అందించాలని సూచించారు. తాగునీరు, బయో టాయిలెట్‌లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. భక్తులకు నిరంతరం అన్నదానం చేయాలని సూచించారు. ప్రసాదాలు సరిపడా తయారు చేయించాలన్నారు. చిన్న పిల్లలకు పాలిచ్చే తల్లుల కోసం బేబీ ఫీడింగ్ గదులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పరిసరాలన్నీ సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంచాలన్నారు. ఆలయం సమీపంలో అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉంచి వాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్యులను, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి భక్తులు ఆలయానికి సులువుగా చేరుకునే విధంగా సూచికా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి నది, సరస్వతీ ఆలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి ఘాట్ ప్రాంతంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగించాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. గోదావరి నదిలో స్నానమాచరించిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదులు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. సమీక్షలో బాసర ఆలయ ఈవో నవీన్‌కుమార్, అసిస్టెంట్ ఈవో సుదర్శన్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్య, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందజేస్తున్న ఆలయ అర్చక వైదిక బృందం, అధికారులు

వేడుకలకు ఆహ్వానం..

బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతి దేవస్థానంలో నిర్వహించే వసంత పంచమి వేడుకల రావాలని అర్చకులు, వైదిక బృందం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను ఆహ్వానించింది. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధానార్చకులు సంజీవ్ పూజారి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఫిబ్రవరి 01 నుంచి 03వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చైర్మన్ శరత్‌టక్, ఆలయ కార్య నిర్వణ అధికారి నవీన్ , ఏఈవో సుదర్శన్‌గౌడ్‌ను ఆదేశించారు.

ఎస్పీని కలిసిన పండితులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బాసర వేద పండితులు ఎస్పీ జానకీషర్మిలను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాసరలో నిర్వహించే వసంత పంచమి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఆర్జీయూకేటీలో వసతులు మెరుగుపర్చాలి

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ఆర్జీయూకేటీలో మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఆర్జీయూకేటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు, ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్సిటీ ప్రాంగణంలో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులతో కమిటీలు ఏర్పాటు చేసి భోజన మెనూలో వారి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వర్సిటీలో మరికొన్ని డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయంలో సీటింగ్ సామర్థ్యం పెంచి, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారికి సౌకర్యంగా ప్రత్యేక పుస్తకాలు సమకూర్చుకోవాలని సూచించారు. వర్సిటీ ప్రాంగణంలో మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దశల వారీగా విద్యుత్ వినియోగం తగ్గిస్తూ, సోలార్ విద్యుత్ వైపుకు మళ్లాలని తెలిపారు. సమావేశంలో ఆర్జీయూకేటీ కార్యాలయ పర్యవేక్షకుడు ప్రొఫెసర్ రణధీర్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సారంగపూర్: రోడ్డు భద్రతా నియమాలను అందరూ పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని ఆర్టీవో కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం, కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ లభిలాష అభివన్ మాట్లాడుతూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే బాధ్యత డ్రైవర్‌పై ఉందన్నారు. వాహనచోదకులకు దృష్టిలోపాలు ఉండొద్దన్న భావనతో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం లభినందనీయమన్నారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఆర్టీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, సహాయ మోటార్ వైహికిల్ ఇన్‌స్పెక్టర్లు ముర్తుజా అలీ, రానాశ్రీ, అక్షయ్, రజనీకాంత్, డీఎంహెచ్‌వో రాజేందర్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కుమార్, నిర్మల్ తహశీల్దార్ రాజు పాల్గొన్నారు.

జిల్లా కవులకు సాహితీ పురస్కారాలు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు కవులు రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు జాతీయస్థాయి సాహితీసేవా పురస్కారాలు అందుకునానరు. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఎంపిక చేసిన జాతీయ సాహితీ సేవా పురస్కారాలకు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవులు బొందిడి పురుషోత్తమరావు, బి.వెంకట్ ఎంపికయ్యారు. గురువారం ఫౌండేషన్ అధ్యక్షుడు గిడుగు కాంతికృష్ణ, శంకరం వేదిక అధ్యక్షురాలు ఎలవర్తి ధనలక్ష్మి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ రాధారాణి, సాహితీవేత్తలు బిక్కి కృష్ణ, గిడుగు రామమూర్తి మనవరాలు సీతా మహాలక్ష్మి చేతుల మీదుగా సాహితీ సేవా పురస్కారాలు స్వీకరించారు. నాలుగు దశాబ్దాలుగా బొందడి పురుషోత్తమరావు వచనకవిత్వంలో సాహితీరంగంలో సేవలందిస్తుండగా, పద్యకవి వెంకట్.. నిర్మల భారతి, తెలంగాణ రచయితల వేదికల ద్వారా సాహితీ సేవ చేస్తున్నారు. సాహితీ రంగంలో గేయం, కథ, వ్యాసం, వచన కవిత్వం తదితర ప్రక్రియల ద్వారా సమాజానికి పలురకాల సందేశాలు ఇస్తున్నారు. జిల్లా కవులు జాతీయస్థాయి పురస్కారాలను పొందడంపై జిల్లాకు చెందిన కవులు, సాహితీవేత్తలు తోడిశెట్టి పరమేశ్వర్, నేరెళ్ల హనుమంతు, కారం శంకర్, డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ దామెర రాములు, ఉప్పు కృష్ణంరాజు, మురళీధర్, కామారపు జగదీశ్వర్, పోలీస్ భీమేశ్ అభినందనలు తెలిపారు.



పురస్కారం స్వీకరిస్తున్న పురుషోత్తమరావు

మహాపూజకు సిద్ధం

- నేడు పవిత్ర గంగాజలంతో మర్రి చెట్టు వద్దకు మెస్రం వంశస్తులు
- 28న నాగోబా జాతర ప్రారంభం

ఇంద్రవెల్లి: మహాపూజలతో ఈ నెల 28న ప్రారంభించనున్న కేస్లాపూర్ నాగోబా జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 17న పవిత్ర గంగాజలం సేకరించిన వారు ఈ నెల 24న ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామ పొలిమేరలోని మర్రి చెట్టుకు చేరనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా ఆలయాభివృద్ధికి రూ.3.60 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇటీవల సీఎస్ శాంతికుమారిని కలిసి నిధుల కోసం విన్నవించారు.

నేడు మర్రి చెట్టు వద్దకు..

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగు నుంచి సేకరించిన పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు శుక్రవారం తెల్లవారుజామున ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి కేస్లాపూర్ గ్రామ సమీపంలోని మర్రి చెట్టు వద్దకు చేరుకుంటారు. ఈ నెల 25, 26, 27 వరకు సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. మెస్రం వంశంలో మరణించిన పెద్దల పేర్లతో తూమ్ పూజలు చేయనున్నారు. ఈ నెల 28న రాత్రి పుష్యమాస అమవాస్యను పురస్కరించుకుని మెస్రం వంశీయులు మహాపూజలతో నాగోబా జాతరను ప్రారంభించనున్నారు. జనవరి 31న దర్బార్ నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

నాగోబా జాతర నిర్వహణకు ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లు తుది దశకు చేరాయి. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదుల వసతులు కల్పిస్తున్నారు.



జాతరకు సిద్ధమైన నాగోబా ఆలయం

పారిశుధ్య నిర్వహణ పనుల కోసం సుమారు రూ.24 లక్షలతో ఐటీడీఏకు ప్రతిపాదనలు పంపించారు. మర్రి చెట్టు, గోవడ్, దర్బార్ హాల్, పోలీస్ క్యాంప్ వద్ద తాత్కాలికంగా 38 స్నానపు గదులు, 15 మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మెస్రం వంశీయుల కోరిక మేరకు ఈసారి అదనంగా 30 తాత్కాలిక స్నానపు గదులు ఏర్పాటు చేశారు. మర్రి చెట్టు, గోవడ్ సమీపంలో 48 శాశ్వత మరుగుదొడ్లు, 10 స్నానపు గదులకు మరమ్మతులు చేపట్టారు. మర్రి చెట్టు వద్ద ఉన్న పవిత్ర జలం కోనేరు, గోవడ్‌ను రంగులతో ముస్తాబు చేశారు. ఆలయ సమీపంలోని హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. నాగోబా ఆలయ అలంకరణ, టెంట్లు వేసే పనులను ముమ్మరం చేశారు. కేస్లాపూర్ గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులు ఆర్థిక స్వావలంబన పొంది ఇతరుల మాదిరి సాధారణ జీవనం గడపడానికి వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు సేవా వ్యాపారాలు స్థాపించుకునేందుకు ఉపాధి, పునరావాస పథకం ప్రవేశపెట్టినట్లు జిల్లా సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా 50 శాతం సబ్సిడీతో 2024–25 ఆర్థిక సంవత్సరం జిల్లాకు 21 యూనిట్లుకు రూ.10.50 లక్షలు సబ్సిడీ మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈనెల 23 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు https://tgobmms. cgg.gov.in/ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారునికి 21 నుంచి 55 ఏళ్ల వయసు ఉండి, 40 శాతంపైగా వైకల్యం ఉండాలన్నారు. అభ్యర్థులు ఐదేళ్లలో దివ్యాంగుల సంక్షేమ శాఖ లేదా మరే ఇతర శాఖ లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి సబ్సిడీ పొంది ఉండకూడదని వివరించారు. జిల్లా సెలక్షన్ కమిటీ అర్హులను ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

బాసర: బాసర ఆర్జీయూకేటీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు టీమ్ వైకింగ్స్ విష్ణు నేషనల్ కాన్సంట్రేట్ కానో కాంపిటీషన్(వీఎన్‌సీసీ) పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. విద్యార్థులను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అభినందించారు. 14 మంది సభ్యుల జట్టు వైకింగ్స్, మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీరాజు ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో అత్యుత్తమ విజయం సాధించిందని పేర్కొన్నారు. తేలికైన కాంక్రీట్ పడవను రూపొందించడం, నిర్మించడం ద్వారా బృందం అసాధారణమైన ఇంజినీరింగ్ నైపుణ్యాలను ప్రదర్శించిందన్నారు. ఇది అద్భుతమైన స్థిరత్వం, తేలి క, బలం, యుక్తి, ఓర్పును ప్రదర్శించిందని పేర్కొన్నారు. 18 జట్లు ఇందులో పాల్గొనగా టీమ్ వైకింగ్స్ ఎండ్యూరెన్స్ టెస్ట్, రిపోర్ట్ సమర్పణ కేటగిరీలో రెండవ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ప్రొఫెసర్ మురళి దర్శన్, అసోసియేట్ డీన్ డాక్టర్ మహేశ్, సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ ఖలీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఇన్‌చారిజ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్..

జూడోలో మెరుస్తున్న క్రీడాపాఠశాల బాలికలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడ పాఠశాలకు చెందిన బాలికలు జాతీయ స్థాయిలో మెరుస్తున్నారు. జాతీయ స్థాయి క్రీడా వేదికలపై సత్తా చాటుతున్నారు. క్రీడా పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి రమ్య, ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న అలేఖ్య జూడో క్రీడలో జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతూ తమదైన ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నారు.

జాతీయస్థాయి పతకాలతో రమ్య


రమ్య

క్రీడా పాఠశాలలో చదివిన రమ్య జూడో కోచ్ రాజు శిక్షణలో రాటుదేలి జాతీయస్థాయి క్రీడాకారిణిగా రాణిస్తోంది. నేషనల్ లెవెల్ ఈవెంట్లలో ఇప్పటివరకు నాలుగు పతకాలతో సత్తా చాటింది. 2023లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ వేదికగా జరిగిన రెండో ఆలిండియా లీగ్ జూడో జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఆల్ ఇండియా లీగ్ నేషనల్ మీట్‌లో రజత పతకంతో మెరిసింది. అంతకుముందు 2021–22లో చండీఘడ్ వేదికగా జరిగిన సబ్ జూనియర్ నేషనల్ ఈవెంట్‌లో కాంస్య పతకంతో నిలిచింది. చెన్నై వేదిక జరిగిన సబ్ జూనియర్ నేషనల్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మరో కాంస్య పతకంతో సత్తా చాటింది. లక్నో వేదికగా జరిగిన మూడో ఆల్ ఇండియా లీగ్ పోటీలు, లుధియానాలో జరిగిన ఎస్జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించింది. ఢిల్లీ వేదికగా ఈనెల 4నుంచి 7వ తేదీ వరకు జరిగిన సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడు బౌట్లలో విజేతగా నిలిచి ఔరా.. అనిపించింది. ప్రస్తుతం పుణె వేదికగా జరుగుతున్న సబ్ జూనియర్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడుతున్న రమ్య, ఫిబ్రవరి 10నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సన్నద్ధమవుతోంది.

అబ్బురపరుస్తున్న అలేఖ్య


అలేఖ్య

అలేఖ్య ఇప్పటివరకు ఆరు జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. భోపాల్ వేదికగా 2022–23లో జరిగిన రెండో ఆల్ ఇండియా లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏడో స్థానంలో నిలిచింది. లక్నోలో జరిగిన మూడో ఆల్ ఇండియా లీగ్‌లో పోటీ పడింది. 2023–24లో శ్రీనగర్ వేదికగా జరిగిన ఎస్జీఎఫ్ జాతీయస్థాయి పోటీలు, త్రిపుర వేదికగా జరిగిన ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. ఢిల్లీ వేదికగా ఈనెల 4నుంచి 7వ తేదీ వరకు జరిగిన సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ పాల్గొనడం విశేషం. ప్రస్తుతం పుణె వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆడుతున్న అలేఖ్య త్వరలో డెహ్రాడూన్ వేదికగా జరగనున్న సీనియర్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలకూ ప్రాతినిధ్యం వహించనుంది.

దేశానికి సేవ చేస్తా



ఆసిఫాబాద్‌రూరల్: అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలని ఉంది. అలాగే ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయడమే నా లక్ష్యం. చిన్నతనం నుంచి క్రీడలు అంటే చాలా ఇష్టం. కోచ్ అరవింద్ ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్ పోటీల్లో ఇప్పటివరకు జాతీయస్థాయిలో మూడుసార్లు, రాష్ట్రస్థాయిలో ఎనిమిది సార్లు పాల్గొని బంగారు, కాంస్య పతకాలు సాధించా. రాష్ట్రంలోనే బెస్ట్ గోల్‌కీపర్‌గా ఉన్నా. ఇటీవల ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లోనూ గోల్డ్ మెడల్ సాధించా.

– మర్సుకోల కవిత, పదో తరగతి, గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల, ఆసిఫాబాద్

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా..



2021లో ఆసిఫాబాద్‌లోని క్రీడా పాఠశాలలో చేరా. కోచ్ విద్యాసాగర్ సూచనలు పాటిస్తూ అథ్లెటిక్స్ పోటీల్లో ఆరుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ఇటీవల జాతీయస్థాయిలో కూడా ఆడాను. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా.

– చిన్నుబాయి, తొమ్మిదో తరగతి, గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల, ఆసిఫాబాద్

వరల్డ్ కప్ ఆడాలని ఉంది



అతి చిన్న వయస్సులోనే ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొన్నా. ఇటీవల జరిగిన ఖోఖో వరల్డ్ కప్ పోటీల్లో ఇండియా కప్ గెలవడం ఆనందంగా ఉంది. రానున్న వరల్డ్ కప్‌లో మన జట్టు తరపున ఆడాలని ఉంది. కోచ్ తిరుమల్ ఆధ్వర్యంలో మెలకువలు నేర్చుకుంటూ కష్టపడుతున్నా.

– నాగేశ్వరి, 7వ తరగతి, గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల, ఆసిఫాబాద్

బాలికలకు రెక్కలిద్దాం!

- ఆడపిల్లలపై చులకన వద్దు..
- వారిని ఎదగనిచ్చి.. భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దాం
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి.. చదువులో సరస్వతి.. ఆదరించడంలో అన్నపూర్ణాదేవి.. కానీ ఇప్పటికీ ఆడపిల్ల అంటే ఓ టెన్షన్ అన్న భావన చాలా మందిలో ఉంది. అయితే ఆడపిల్ల అంటే టెన్షన్ కాదు.. టెన్ సన్స్‌కు సమానం అంటున్నారు నేటితరం బాలికలు. చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. సమాజంలో బాలికల సంరక్షణపై అవగాహన కల్పించడానికి బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజికంగా ఎదుగుదల, అంశాలపై అవగాహన కల్పించడానికి 2008 నుంచి ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వివిధ క్రీడల్లో రాణిస్తున్న బాలికలపై ప్రత్యేక కథనం.


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాలలో సాధన చేస్తున్న విద్యార్థినులు

పేదరికంలో క్రీడా ఆణిముత్యం


రాథోడ్ అనూష

భైంసాటౌన్: అసలే పేదరికం.. ఓవైపు అమ్మ, చెల్లికి అనారోగ్యం.. మరోవైపు క్రీడల్లో రాణించాలన్న పట్టుదల. కుటుంబ బాధ్యతలు మోస్తూనే తన లక్ష్యంపై గురిపెట్టింది. రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ వేదికపై సైతం సత్తా చాటింది. ఆమే.. తానూర్ మండలం బామ్నితండాకు చెందిన రాథోడ్ అనూష. తల్లి హీరాబాయి ఇటీవల అనారోగ్యం బారిన పడగా, తండ్రి గులాబ్ ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. అనూషకు అక్క, అన్న ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. పదో తరగతి వరకు భైంసాలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుకున్న అనూష పాఠశాల స్థాయిలో కరాటేలో శిక్షణ పొందింది. దీంతో ఆటలపై మక్కువ పెంచుకుని, భైంసాకు చెందిన కోచ్ శ్రీరాముల సాయికృష్ణ నేతృత్వంలో అషిటెడో అకాడా, కిక్‌బాక్సింగ్, వుషూ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో మూడుసార్లు బంగారు పతకాలు, జాతీయస్థాయిలో కాంస్య పతకాలు సాధించింది. కిక్‌బాక్సింగ్‌లో ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది.

తండా నుంచి అంతర్జాతీయ స్థాయికి..


జాతీయ పతాకంలో రాథోడ్ స్వాతి

కుభీర్: మండలంలోని సిర్పెల్లి తండా రెంబర్ ఒకటికి చెందిన రాథోడ్ స్వాతి కిక్ బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించింది. 5వ తరగతి వరకు పల్సిలోని ప్రైవేటు స్కూల్‌లో చదువుకుంది. ఇంటర్ భైంసాలోని కస్తూరిబా పాఠశాలలో చదివింది. 8వ తరగతి నుంచి కోచ్ శ్రీరాములు, సాయికృష్ణ ప్రోద్బలంతో ఆదిలాబాద్‌లో జిల్లాస్థాయిలో మెడల్ సాధించగా నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయిలో ఆడి ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఢిల్లీలో ఆడి ఆ తరువాత అంతర్జాతీయ స్థాయి పోటీకు ఎంపికైంది. ఇటలీలో ఆడి గోల్డ్ మెడల్ సాధించింది. ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఇటీవలే సీఆర్పీఎఫ్ ట్రెనింగ్ పూర్తిచేసింది. ఆర్మీ లేదా నేవీలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని స్వాతి చెప్పింది.

బాక్సింగ్, కిక్‌బాక్సింగ్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ


పతకాలతో నాగలక్ష్మి, నందిని

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కూలీ దంపతులు కార్యారి గంగమణి–లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు నాగలక్ష్మి సోన్ కేజీబీవీలో 10వ తరగతి, చిన్నకూతురు నందిని 9వ తరగతి చదువుతున్నారు. పెద్ద కూతురు నాగలక్ష్మి చిన్ననాటి నుంచి కిక్‌బాక్సింగ్‌పై ఉన్న ఆసక్తికి తోడు తల్లి దండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తోంది. అక్క నాగలక్ష్మిని స్ఫూర్తిగా తీసుకుని చెల్లెలు నందిని సైతం బాక్సింగ్ పోటీల్లో రాణిస్తోంది. ఇటీవల జరిగిన సీఎం కప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచింది. అక్కాచెల్లెళ్లు జిల్లా, రాష్ట్రస్థా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. తాజాగా ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో నందిని సీటు సాధించింది.

పోటీల్లో ఉత్తమ ప్రతిభ..

హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్–2023లో జూనియర్ విభాగంలో నాగలక్ష్మి బంగారు పథకం సాధించింది. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లోనూ నేషనల్ స్పోర్ట్స్ డే కిక్ బాక్సింగ్‌లో ప్రశంసాపత్రం జ్ఞాపికను అందుకుంది. అ క్క నాగలక్ష్మిని స్ఫూర్తిగా తీసుకుని చెల్లెలు నందిని సైతం బాక్సింగ్ పోటీల్లో రాణిస్తుంది. గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లో సహా రా బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాక్సింగ్ బాయ్స్ అండ్ గర్ల్స్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పథకాలు సాధించింది.

క్రీడా 'స్ఫూర్తి'


వగాడి స్ఫూర్తి

చింతలమానెపల్లి(సిర్పూర్): రెండు విభిన్న క్రీడాంశాల్లో రాణిస్తోంది చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లి గ్రామానికి చెందిన వగాడి స్ఫూర్తి. నారాయణ, మోహిని దంపతుల కుమార్తె స్ఫూర్తి సాఫ్ట్ బేస్‌బాల్, అండర్ ఆర్మ్ క్రికెట్‌లో జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం బెల్లంపల్లిలోని గురుకుల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల భూటాన్‌లో జరిగిన సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. భారతజట్టు విజేతగా నిలవగా స్ఫూర్తి ఉమెన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. సిర్పూర్(టి) బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే అండర్ ఆర్మ్ క్రికెట్‌లోనూ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. గ్రామీణ స్థాయిలో బాలికలకు అంతగా అవకాశాలు రావని, కోచ్ గురువేందర్ సహకారంతో రాణించానని స్ఫూర్తి చెబుతోంది. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించి దేశానికి పేరు తీసుకొస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

బ్లాక్ బెల్ట్ సాధనే లక్ష్యంగా..



బోథ్: మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ, స్వప్న దంపతుల కుమార్తె రుచిత కరాటేలో రాణిస్తోంది. స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. రెండేళ్లుగా కరాటే మాస్టర్ రాజు వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బ్లూబెల్ట్ సాధించింది. బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలను సాధించింది. కరాటే పోటీలు ఎక్కడ నిర్వహించినా పాల్గొంటోంది. కాగా, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బ్లాక్ బెల్ట్ సాధించడమే తన లక్ష్యమని రుచిత పేర్కొంటోంది.

– రుచిత

క్రికెటర్ సంజన



జైపూర్: మంచి ర్యాల జిల్లా జై పూర్‌లోని ఉన్న త పాఠశాలలో చదువుతున్న ఈసం సంజన క్రికెట్ పోటీల్లో రాణిస్తోంది. టేకుమట్ల గ్రామానికి చెందిన సంజన చిన్నప్పటి నుంచే ఆటపై మక్కువ పెంచుకుంది. పీఈటీల ప్రోత్సాహంతో సాధన చేస్తూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా జట్టు తరపున ఇటీవల వరంగల్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 బంతుల్లో 34 పరుగులు, ఖమ్మంతో మ్యాచ్‌లో 14బాల్స్‌కు 10 పరుగులు సాధించింది. క్రికెట్ పోటీల్లో తనదైన శైలిలో బ్యాటింగ్ చేస్తూ శభాష్ అనిపించుకుంటోంది. జాతీయ స్థాయిలో సత్తా చాటడమే తన లక్ష్యమని పేర్కొంది.

పతకాల 'పరుగు'



జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీహర్షిత 9వ తరగతి చదువుతోంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పరుగు పందెంలో పతకాలు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పరుగు పందెంలో పాల్గొంది. జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 13న హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో మూడో స్థానంలో నిలిచింది. తనలోని ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించడం వల్ల రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నట్లు శ్రీహర్షిత తెలిపింది.

– శ్రీ హర్షిత

స్పోర్ట్స్ కోటాలో జాబ్ సాధిస్తా



చెన్నూర్: ఇప్పటి వరకు ఐదు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. జిల్లా స్థాయిలో 10కి పైగా గోల్డ్ మెడల్స్ సాధించా. గణితం సబ్జెక్ట్ అంటే నాకు చాలా ఇష్టం. షాట్‌పుట్, డిస్కస్‌త్రోలతో ఇప్పటివరకు పతకాలు సాధించాను. పీఈటీ అనిత ప్రతీరోజు శిక్షణ ఇస్తున్నారు. వచ్చే జాతీయ స్థాయిలో పోటీల్లో గెలుపొందుతా. ఉన్నత చదువులు చదివి స్పోర్ట్స్ కోటాలో జాబ్ సాధిస్తా.

– అజ్మీర శిరేఖ, 9వ తరగతి, కస్తూర్బా పాఠశాల, చెన్నూర్

కబడ్డీలో అంజలి మేటి



ఇచ్చోడ: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన టేకం అంజలి ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఐదో తరగతి నుంచి ఇక్కడే చదువుకుంటున్న అంజలి కబడ్డీలో రాణిస్తోంది. 2023లో గజ్వేల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంది. 2024లో హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాలు సాధించింది. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన అంజలి భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది.

అథ్లెటిక్స్‌లో వైష్ణవి దిట్ట



ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల మండలం మంగుర్ల గ్రామానికి చెందిన ఆడ వైష్ణవి ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో ఎంపీసీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. చిన్నప్పటి నుంచే అథ్లెటిక్స్ పోటీల్లో చురుకుగా పాల్గొంటోంది. 2023లో భద్రాచలంలోని కిన్నరసానిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. 2204లో ఉట్నూర్‌లో నిర్వహించిన ఇంటర్ లీగ్ రాష్ట్ర పోటీల్లో 100 మీటర్ల పరుగు పోటీలో మొదటి బహుమతి గెలుచుకుంది.

విద్యార్థి అనుమానాస్పద మృతి


మృతుడు ఆదర్శ్(ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో పదో తరగతి విద్యార్థి ఆదర్శ్(16) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ మండలం భీరెల్లి గ్రామానికి చెందిన మారగొని రవి, స్వరూప దంపతులకు ఇద్దరు కుమారులు అజయ్, ఆదర్శ్ ఉన్నారు. అజయ్ మంచిర్యాలలో ఇంటర్మీడియెట్, ఆదర్శ్ చెన్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. సంక్రాంతి సెలవులు పూర్తి కావడంతో ఆదర్శ్ బుధవారం ఉదయం 9గంటలకు స్కూల్‌కు వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి బ్యాగు తీసుకుని గ్రామం నుంచి చెన్నూర్‌కు వచ్చాడు. సాయంత్రం వరకు స్కూల్‌కు రాకపోవడంతో సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎటు వెళ్లాడోనని తల్లిదండ్రులు రాత్రి నుంచి గాలిస్తున్నారు. గురువారం చెన్నూర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో అనుమానాస్పద స్థితిలో ఆదర్శ్ మృతిచెంది ఉన్నాడు. సంఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్సై సుబ్బారావు పరిశీలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

స్కూల్‌కు పోతన్నవని సంబర పడ్డాం కొడుకా

'పండుగ సెలవులు అయిపోయాయి అమ్మా నేను స్కూల్‌కు పోతున్న అని చెప్పితే సంబర పడ్డాం కొడుకా.. మా బతుకుల్లో చీకటి నింపి మాకు కన్పించకుండా వెళ్లిపోతావని అనుకోలేదు..' అంటూ ఆదర్శ్ తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

ఒకరి అదృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని పోలీస్ కాలనీకి చెందిన 39 ఏళ్ల హలత్కర్ ప్రదీప్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఇంట్లో నుంచి బయలుదేరిన ఆయన మధ్యాహ్నం 3.30గంటలకు ఆర్టీవో కార్యాలయ సమీపంలోని వారి బార్బర్‌షాపునకు వచ్చాడు. తన సోదరుడు సందీప్‌కు తాను బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు చుట్టుపక్కల, తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్ సమీపంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వివరాలు.. నార్నూర్ మండలానికి చెందిన నితిన్, లాల్‌సావ్ పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


మాజీ సర్పంచ్‌కు జరిమానా

బెల్లంపల్లిరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని చెట్లను నరికివేయించిన మాజీ సర్పంచ్‌కు అధికారులు జరిమానా విధించారు. హరితహారంలో భాగంగా నాటిన 21 చెట్లను దుగ్నెపల్లి మాజీ సర్పంచ్ డోలే సురేష్ ఎలాంటి అనుమతి లేకుండా నరికి వేయించాడు. పలువురు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయగా అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్వో పూర్ణచందర్ విచారణ జరిపి రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్వో, ఎంపీడీవో మహేందర్ తెలిపారు. కాగా ఘటన బెల్లంపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ముగ్గురి రిమాండ్

ఖానాపూర్: గత నెల ఖానాపూర్ రేంజ్ పరిధిలో కలప స్మగ్లింగ్‌కు పాల్పడ్డ 12 మంది ముఠాలోని ముగ్గురిని అటవీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. నాగేశ్, శ్రీనివాస్, రాజ్‌గోపాల్‌ను గురువారం ఖానాపూర్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి జుడీషియల్ కస్టడీ విధించారు. వారిని నిర్మల్ జైలుకు తరలించామని ఎఫ్ఆర్వో కిరణ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు ఆశాలు(ఫైల్)

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సోమగూడెం పాతబస్తీకి చెందిన ఇలాసాగరం ఆశాలు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆశాలు కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మధుమేహం, తిమ్మిర్లు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విషపు నీరు తాగి 12 గేదెలు మృతి

- ఆలస్యంగా వెలుగులోకి..


పశు వైద్య ఆసుపత్రిలో గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి ఓం ప్రకాష్

సోన్: మండలం కేంద్రంలో 12 గేదెలు విషపు నీరు తాగి మృత్యువాత పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పశు వైద్యాధికారి ఓం ప్రకాశ్, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం .. సోన్ గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన 40 గేదెలు రోజులాగానే పది రోజుల క్రితం గోదావరి నది సమీపంలోకి మేతకు పశువుల కాపరి తీసుకెళ్లాడు. మేత మేసిన తర్వాత గోదావరిలోని నీటిని తాగాయి. ఇంటికి వచ్చాక అస్వస్థతకు గురి కావడంతో రైతులు తోచిన వైద్యం చేశారు. తర్వాత పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో పశువులను పరిశీలించిన పశువైద్యాధికారి వాటి లక్షణాల ఆధారంగా కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. ఈమేరకు చికిత్స ప్రారంభించారు. అయితే చికిత్స పొందుతూ ఇప్పటికే 12 గేదెలు మృతిచెందాయి. చనిపోయిన గేదెలకు ఆదిలాబాద్ నుంచి వచ్చిన పశువైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం మిగతా గేదెలు కోలుకుంటున్నాయని వైద్యులు తెలిపారు. చేపల కోసం గుర్తు తెలియని వ్యక్తులు నీటిలో విషం కలిపి ఉంటారని అనుమానిస్తున్నారు. గేదెలు తాగిన నీటిని కూడా పరీక్షకు పంపినట్లు వెల్లడించారు.

ఇంగ్లిష్‌పై పట్టుసాధించేలా కృషి


టీం సభ్యులతో పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాల్లో చదువుతున్న ప్రైమరీ విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో అధికారులతో పీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంగ్లిష్ కార్యక్రమం అమలుకు సంబంధించిన పురోగతిపై అధికారులు పీవోకు వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన తాజా వివరాలు, వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పోటీలు, విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై ఆసక్తిని పెంపొందించే విధానాలపై చర్చించారు. అధికారులనుద్దేశించి పీవో మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లోని ప్రైమరీ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాహిత్యంపై ఆసక్తి పెంపొందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. గెలుపుదండాలకు సంబంధించి లోగోను పీవో ఆవిష్కరించారు. సమావేశంలో ఐటీడీఏ ఏసీఎంవో జగన్, విభా ప్రోగ్రాం మేనేజర్ వీరనారాయణ, ఎల్ఎఫ్‌డబ్ల్యూ టీం సభ్యులు విజయ్‌కుమార్, లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.